మద్యం లోడ్‌తో వ్యాన్ బోల్తా

వడమాలపేట, జూన్ 12 ప్రభాతవార్త: వడమాలపేట మండలం తడుకు ఆర్ఎస్ కూడలి వద్ద మద్యం లోడ్‌తో వస్తున్న వ్యాన్ బోల్తా పడింది. రేణిగుంట నుంచి మద్యం లోడ్‌తో వడమాలపేట మీదుగా విజయపురం వెళుతున్న సమయంలో తడుకు ఆర్ఎస్ వద్ద టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వ్యాన్‌లోనిమద్యం బాటిళ్లు రోడ్డుపై పడిపోయాయి. వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జనాలను చెదరగొట్టారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

పోలీసులు యోగాసనాలు

తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:

యోగాతో పోలీసులకు శారీరక అలసట ఉండదని, మనస్సు ఏకాగ్రత కలుగుతుందని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ తెలి పారు. ప్రతిరోజూ యోగాతో పోలీసులు ప్రశాంతంగా విధులు నిర్వహించగలరన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం తిరుమల ట్రాఫిక్, క్రైమ్ పోలీసులు ఎస్వీ హైస్కూల్‌లో యోగా ఆసనాలు చేశారు. ఉదయం 6గటంల నుండి 7గంటల వరకు ఈ ఆసనాలు చేసి, ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారు.

హనుమంత, గజవాహనాలపై శ్రీవారు

హనుమంత వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు
గజ వాహనంపై స్వామివారి విహారం

వడమాలపేట, జూన్ 12 ప్రభాతవార్త:

అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం మనుమంత వాహనంపై, రాత్రి గజ వాహనాలపై విహరించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు రామావతారం అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. సర్వంగా సుందరంగా అలంకృతుడై హనుమంత వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించగా భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీనివాసునికి అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిగింది. మధ్యాహ్నం 3-4గంటల మధ్య పుణ్యాహం, వసంతోత్సవం నిర్వహించారు. రెండవ గంట నైవేద్యం అనంతరం ఊంజల్‌సేవలో ఉభయ దేవేరులతో పాటు శ్రీవారు ఉయలలో కొలువుదీరి భక్తులకు దర్శన మిచ్చారు. సాయంత్రం 7 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు సర్వలంకారభూషితుడై గజ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. భక్తులు అడుగడుగునా స్వామివారికి కర్పూర హారతులు నారికేళాలు సమర్పిస్తూ భక్తితో కొలుచుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల వాహనానికి ముందు డప్పులు, కోలాటాలు, నృత్యాలతో భక్తులను అలరించారు. వాహన సేవలో టీటీడీ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు, కంకణ బట్టర్ తిప్పయాచార్యులు, రమణాచార్యులు, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై నాన్చుడే?

ఏడాదిలో "జనం"కు చేసిన మంచేమిటో!?

ప్రభాతవార్త-తిరుపతి:

"ఇంటగెలచి రచ్చగెలవమన్నారు పెద్దలు"ఇందుకు భిన్నంగా తిరుపతి నియోజకవర్గంలోజనసేన పార్టీ నేతల తీరు తయారైంది.సరిగ్గా ఏడాదిక్రిందట తిరుపతిలో గెలిచిన జనసేన పార్టీ ఎమ్మెల్యే ఏడాదిలో తిరుపతిజనానికి చేసిన మంచి పనులు ఏమిటనేది జనంలో చర్చమొదలైంది. 2024 ఎన్నికల్లో కూటమి పార్టీల ఒప్పందంలో తిరుపతి టిక్కెట్ జనసేనపార్టీకి కేటాయించడం, ఇక్కడ ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులును జనం గెలిపించారు. ఆయన ఎమ్మెల్యేగా ఏడాది పూర్తిచేసుకుంటున్నా జనం మధ్య ఉన్న రోజులు చాలా తక్కువేనని చెప్పుకోవచ్చు. పైగా నగరంలోని పలు డివిజన్లలో జనం ఎదుర్కొంటున్న కనీస సమస్యలపై మొర వినిపించుకునేవారే లేకపోగా సిట్టింగ్ ఎంఎల్ఎ కనీసం వారంలో ఒక డివిజన్‌లో కూడా పర్యటించలేకపోవడం, జనం వద్దకు వచ్చే తీరికకూడా లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.ఆయన చుట్టుచేరిన భజనపరులు కూడా ఇప్పుడు తమ పనులు జరగడంలేదని దూరమవుతున్నారనేది గుప్పుమంటోంది. ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవ్వడం వరకే పరిమితమై పోయారనేది సొంత పార్టీలోనే గుసగుసలు. కొన్ని కాలనీల్లో తాగునీటి సమస్య ఎదురవుతుండగా ,మరికొన్ని కొన్ని కాలనీల్లో డ్రైనేజీ సమస్యలతో అక్కడి జనం సతమతమవుతున్నారు. ఇవేమీ తమకు పట్టనట్లు నాయకులు వారివారి పనులు చక్కబెట్టుకోవడమే ప్రధానంగా సమయం గడిపేస్తున్నారనేది నగరజనంలో వినిపిస్తున్న వాదన. జనసేనాని ,అధినేత పవన్‌కల్యాణ్ జనం కోసం చేస్తున్న కృషి కూడా ఇక్కడ నేతలు చేయడంలేదంటే అతిశయోక్తికాదు. కొందరు కార్పొరేటర్లు తాము చెప్పిన సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదనే అసహనం వ్యక్తం చేస్తుండటం మరో విశేషం. ఈ నేపథ్యంలో తిరుపతిలో జనసేనపార్టీకి చెందిన జనసేనానీలను వ్రేళ్ళపై లెక్కపెట్టొచ్చు.గత ఎన్నికల సమయంలో కొందరు పార్టీ మారి జనసేనా కండువా వేసుకున్నారు. అలాంటి నేతలు జనంలో లేకపోతున్నారు. ఇప్పటికీ తిరుపతిలో వృద్ధాప్య ఫించన్లు రావడం లేదని, రేషన్‌కార్డులు లేవని, సొంత ఇళ్ళు లేవని, స్థలాలు ఆక్రమణలు, భూ కబ్జాలపై ఫిర్యాదులు చేస్తున్నా కనీసం కనికరించే నాయకుడు లేరని వాపోతున్నారు. తిరుపతి నియోజకవర్గంలో జనసేనపార్టీకి చెందిన ముగ్గురు నలుగురు కీలక నేతలు క్రియాశీలకంగా ఉంటున్నా ఆ కొందరు కూడా జనంలో లేకపోతుండటం , జనం సమస్యలు వినేందుకు ప్రాధాన్యత ఇవ్వలేకపోతున్నారు. ఈ నేతలు కూడా స్థానిక ప్రజాప్రతినిధిని ఉదయం కలసి హాజరు వేసుకోవడం చేస్తున్నారనేది విమర్శలు.

పందిళ్ళపల్లి వద్దు-మేకలచిన్నేపల్లే ముద్దు...!

విలీనంపై విద్యార్థుల ఆందోళన -తొలిరోజునే బడి మూసేసిన వైనం

చౌడేపల్లి, జూన్ 12 ప్రభాతవార్త

అందరికీ అనుకూలంగా వుండే మేకలచిన్నేపల్లి ప్రాథమిక పాఠశాలను అలానే వుంచాలనీ, తాము పందిళ్ళపల్లికి వెళ్ళమని విద్యార్థులు వారి తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేసారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం తాజాగా మోడల్ స్కూల్ పేరుతో విలీన ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలో 3నుంచి 5వరకు వున్న విద్యార్థులను సమీపంలోని మరో ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేసి ఉపాధ్యాయుల సంఖ్యను పెంచే చర్యలు తీసుకొన్నారు. ఇందులో బాగంగా మేకలచిన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలోని 37మంది విద్యార్థులను పందిళ్ళపల్లి పాఠశాలలో విలీనం చేస్తూ అధికారులు చర్యలు తీసుకొన్నారు. అయితే ఆ గ్రామానికి వెళ్ళాంటే నాయనచెరువు కట్ట వుందనీ, వర్షాలు కురిసే సమయంలో మొరవ ఉధృతి అధికంగా వుంటుందన్నారు. అంతే కాకుండా తోటకురపల్లి, ఎస్టీలు నివసించే తామరాకులవడ్డు, ముదిరెడ్డిపల్లిల నుంచి పిల్లలు వస్తుంటారనీ, పందిళ్ళపల్లి ఆయా గ్రామాలకు మరింతగా దూరంగా వుంటుందన్నారు. పాఠశాల కమిటీ ఆపేయడంతో పాఠశాల మూత పడింది.

పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

ప్రాథమిక విద్య పటిష్టత కోసమే విలీనం : ఎంఇఓ

ప్రభుత్వం ప్రాథమిక విద్య పటిష్టత కోసం మోడల్ పాఠశాలను తెచ్చిందనీ, విద్యాభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కోసమే విలీన ప్రక్రియ చేపట్టినట్లు ఎంఇఓ కేశవరెడ్డి తెలిపారు. మేకలచిన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలోని 3నుంచి 5వరకు చదువుతున్న విద్యార్థులను పందిళ్ళపల్లిలో విలీనం చేయడం వల్ల మరో ముగ్గురు ఉపాధ్యాయులు పెరుగుతారన్నారు. అదే విధంగా విద్యార్థుల అభ్యసనా శక్తి పెరుగుతుందన్నారు.

కొడుకు చేతిలో తండ్రి దారుణ హత్య

చిత్తూరులో దారుణం

- చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ తండ్రి అతని కుమారుడి చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. చిత్తూరు లెనిన్‌నగర్‌కు చెందిన టి.వెంకటరెడ్డి(50)ని అతని కుమారుడు సోమశేఖర్‌రెడ్డి(21) కత్తితో దాడి చేసి హత్య చేశాడు. వెంకటరెడ్డి నివాసం వున్న ఇంట్లోనే ఈ ఘటన జరిగింది. చిత్తూరు టుటౌన్ ఇన్‌ఛార్జీ ఇన్స్‌పెక్టర్, వన్‌టౌన్ సిఐ మహేశ్వర్ వెల్లడించిన వివరాల మేరకు లెనిన్ నగర్‌లో టి.వెంకటరెడ్డి కుటుంబం నివాసం వుంటుంది. వెంకటరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, భార్య సరస్వతి కాగా కుమారుడు మోహన్‌రెడ్డి(24), సోమశేఖర్‌రెడ్డి(21)లు వున్నారు. వెంకటరెడ్డి లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబ పోషణ చేసేవాడు. ఈ క్రమంలో వెంకటరెడ్డి తరచు మద్యం సేవించి ఇంటికి కావడం, ఇంట్లో భార్య సరస్వతితో గొడవ పెట్టుకోవడం చేస్తుండేవాడు. ఈ మధ్యలో భార్య సరస్వతిని మద్యం సేవించి వచ్చి ఘర్షణ పడి కొట్టేవాడు. ఈక్రమంలో వెంకటరెడ్డి గురువారం యధావిధిగా మద్యం సేవించి ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో చిన్న కుమారుడు సోమశేఖర్‌రెడ్డి వున్న విషయం గమనించకుండా భార్య సరస్వతితో గొడవపడి భార్యపై కత్తితో దాడి చేయబోయాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కుమారుడు సోమశేఖర్‌రెడ్డి ఈ దృశ్యం చూసి తండ్రిపై తిరగబడ్డాడు. తండ్రి తన తల్లిని హత్య చేయడానికి తీసుకువచ్చిన ఆయుధంను తాను తీసుకుని తండ్రి వెంకటరెడ్డిపై దాడి చేశాడు. ఈ దాడిలో వెంకటరెడ్డి అక్కడికక్కడే పడి మృతి చెందాడు. స్థానికులు ఈ విషయంను చిత్తూరు టుటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని పరిశీలించారు. వెంకటరెడ్డి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి కార్యకర్తలు, నాయకులు జోలికొస్తే తాట తీస్తాం

- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, జూన్ 12, ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయిందని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుంది కాబట్టే ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని గూడూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. గూడూరు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి ఆయన నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులతో కలసి ర్యాలీ నిర్వహించి టవర్ క్లాక్ సెంటర్ వరకు నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ కూడలి వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేటినుండి అమల్లోకి తీసుకువచ్చే ప్రణాళికలను ఈపాటికి సిద్ధం చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.ప్రభుత్వ పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పును తీసుకువస్తున్నాయన్నారు. దే విధంగా గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం గూడూరులో ప్రజల మద్దతును గెలుచుకుందని, తమ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని ఆయన స్పష్టం చేసింది.

ఐదేళ్ళలో భూములను ఆక్రమించుకున్నారు!

అక్రమ సంపాదనలతో జేబులు నింపుకున్నారు

ఏడాదిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు: బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త

ఐదేళ్ళ పాటు ఏకచ్ఛత్రాధి పత్యంగా పరిపాలించిన వైకాపా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి జగనన్న కాలనీ పేరుతో భూసేకరణలో పేదల భూముల్లో వాటాలు పంచుకున్నారు. పవిత్రమైన దేవాలయాన్ని రాజకీ య వేదికగామార్చారు. పనులను పంచి పెట్టారు.శివరాత్రి ఉత్సవాల్లో భారీ ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. అక్రమ సంపాదనలతో జేబులు నింపుకున్నారని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది అయిన సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఏ విధంగా నిధులు సాధించాము? పరిపాలనను ఎలా చక్కదిద్దుతున్నాము? రాబోవు రోజుల్లో విజన్ 2029ని ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళుతున్నామో? వివరించారు. కూటమి పాలన ఏడాదిలో శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశలో నడుపుతున్నామన్నారు.

ఆలయ పరిసరాల అభివృద్ధికి పెద్ద పీట: ముస్లింల అభివృద్ధికి ఊతం:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రధానంగా ప్రజలకు కనబడేది శ్రీకాళహస్తీశ్వరాలయం. గతంలో శివరాత్రి అంటే రూపాయి పనికి వంద రూపాలు సొమ్ము చేసుకోవటం నాటి పాలకుల నిత్యకృత్యాలయ్యాయన్నారు.కానీ తాను శివరాత్రి సందర్భంగా యుద్ధ ప్రాతిపదికపై సన్నిధివీధిలో రోడ్లను వెడల్పు చేసామన్నారు.కాగా రాజగోపురం పక్కన చక్కటి సిమెంటు రోడ్డు వేసామన్నారు. అలాగే ఎసిసీడ్స్ కూడలి నుంచి ఆలయం వరకు చక్కటి రోడ్డును నిర్మించామన్నారు. కాగా శివం టు శివం రోడ్డు మాటలకు కాకుండా చేతల్లో అమలు చేస్తున్నామన్నారు.

గంగ కాలువలో యువకుడు గల్లంతు

తొట్టంబేడు,/శ్రీకాళహస్తి రూరల్,జూన్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామానికి చెందిన పెరిమిడి మురళీ కృష్ణ(25) గురువారం తెలుగుగంగ కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. ఈమేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిఐ నాగార్జున్‌రెడ్డి అందించిన సమాచారం మేరకు మురళీ కృష్ణ ఇడుపాయలో త్రిబుల్ ఐఐటి పూర్తి చేసి బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన మురళీ కృష్ణ స్నేహితులు ప్రశాంత్,ధనూష్‌తో కలసి తెలుగుగంగ కాలువ కన్నలి వద్దకు వెళ్ళారు. ఇక్కడ కాలువలో దిగారు. మురళి కృష్ణకు ఈత వచ్చినా నీటి వరవడి,వేగాన్ని తట్టుకోలేక కొట్టుకుపోయాడు. అయితే ఆతనితో వెళ్ళిన ఇద్దరు మాత్రమే సేఫ్‌గా ఉన్నట్లు సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు. సాయంత్రం పిర్యాదు అందటంతో సిఐ నాగార్జున్‌రెడ్డి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కలసి కాలువలో గాలిస్తున్నారు.కానీ రాత్రి వరకు ఆచూకి తెలియలేదు. ఎన్నో ఆశలతో తల్లిదండ్రులు మురళీకృష్ణను ఇడుపాయలలో చేర్చారు. చదువుల్లో రాణించిన మురళీకృష్ణ ఎంతో చలాకిగా ఉండేవాడు. గ్రామంలో కూడా బాగా చదువుకుంటున్నాడని మంచి పేరు ఉంది. ఆతను మధ్యాహ్నం ఇంటిలో భోజనం చేసి ఈతకు వెళ్లి ఇలా జరగటంతో తల్లిదండ్రులు కుప్ప కూలి పోయారు. టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. సిఐ నాగార్జున్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులందరికీ ప్రభుత్వం తరపున న్యాయం చేస్తాం : విద్యాధరి

శాంతిపురం/రామకుప్పం, జూన్ 12 ప్రభాతవార్త

ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం తరపున న్యాయం చేసి తగు పరిహారం అందిస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. గురువారం రామకుప్పం, శా ంతిపురం లలో ఎయిర్‌పోర్టు భూములపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ రైతులు అధైర్య పడరాదని ప్రభుత్వం అన్ని విధాలా నిర్వాసిత రైతుల్ని ఆదుకుం టుందని భరోసా ఇచ్చారు. 2017లో రైతులకు ఇచ్చిన భూసేకరణ మొత్తం పెంచాలని పలువురు రైతులు కోరగా అప్పటి ధరలకు పరిహారం అందించామన్నారు. ప్రస్తుతం వాటిని పెంచే ప్రసక్తే లేదన్నారు. అప్పటినుంచి రైతులకు నగదు జమ కాకుండా ఉంటే వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తామన్నారు. రైతుల పంటల ఎగు మతుల దృష్టా ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తోందన్నారు. రైతులు సహకరించాలని ఆమె కోరారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభు త్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, కడ సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు,

చంద్రబాబుతోనే సుపరిపాలన

- జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏడాది పాలన సంబరాలు

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:

సిఎం నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం సుభిక్షంగా వుండి అభివృద్ధిలో పరుగులు తీస్తోందని మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన పూర్తి చేసుకోవడంతో గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్‌లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో మంచి ప్రభుత్వంగా ప్రజల నుండి పేరు తెచ్చుకుందన్నారు. సుపరిపాలన, పారదర్శక పాలన, కక్షసాధింపులు లేని పాలన, ప్రజా ప్రభుత్వంగా ప్రజల నుండి మన్ననలు పొందుతుందన్నారు. ఏడాది పాలనలో రాష్ట్రం 70 శాతం ప్రజలు సంతృప్తిగా వున్నారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లను సమతుల్యం చేసుకుని సిఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంను ప్రగతి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ, పాలసముద్రం రాజేంద్ర, త్యాగరాజన్, జయచంద్రనాయుడు, విజయకుమార్, బాలు, అనురాధ, మేషక్, కంద తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సంక్షేమంతోనే

ప్రజలు ఆనందం

-ఏడాది పాలనతో తిరుపతిలో నేతల సంబరాలు

తిరుపతి,జూన్ 12ప్రభాతవార్త:

నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా విశేష అనుభవం కలిగిన ,ప్రస్తుతం ఏడాది పాలన పూర్తిచేసుకున్న కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారని పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ తెలిపారు. పేపలకు ఫెన్షన్లు పెంపు, అన్నక్యాంటీన్లు, దీపం 2పథకం, తల్లికి వందనం,మత్స్యకారసేవ,రైతులకు నిధులు వంటివి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్దిచేకూర్చేలా సిఎం చంద్రబాబు,డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్ సమిష్టిగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తూ ఏడాదికాలం పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం ఉదయం తిరుపతి టౌన్‌క్లబ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి అభిషేకాలుచేసి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయోత్సవ కేక్‌కటచేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్, దంపూరిభాస్కర్, డాక్టర్ సంజయ్, టిడిపి రాష్ట్రమీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, విజయలక్ష్మి, తిరుపతి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ; డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, అన్నా అనితయాదవ్, నాయకులు ఊట్ల సురేంద్రనాయుడు, మన్నెం శ్రీనివాసులు, బిజి కృష్ణయాదవ్, చిన్నబాబు, కంకణాల రజినీకాంత్ నాయుడు, బిజి కృష్ణయాదవ్, ఆనంద్‌బాబుయాదవ్, కార్జాలబాలాజీ, పాఠకం వెంకటేశ్, తెలుగుయువత నాయకుడు ఆర్‌పి శ్రీనివాసులు,సింధుజ ,ఆముదాల తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

సదం, జూన్ 12, ప్రభాతవార్త

పాఠశాలలు గురువారం రీఓపెన్ కావడంతో మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. సదుం ప్రాథమిక పాఠశాలలో స్థానిక ప్రభుత్వ వైద్యశాల మాజీ చైర్మన్ వై శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ దామోదర ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయకుమార్ రెడ్డి, విద్యా కమిటీ స్కూల్ చైర్మన్ యాస్మిన్, కమిటీ సభ్యులు మోలానా, ఆరవపాలం రత్న తదితరులు పాల్గొన్నారు.

సిడిపిఓగా వినూతశ్రీ

బంగారుపాళ్యం, జూన్ 12 ప్రభాతవార్త: బంగారుపాళ్యం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణిగా వినూతశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గంగాధరనెల్లూరు సిడిపిఓ కార్యాలయం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సిడిపిఓగా విధులు నిర్వహిస్తున్న వాణీశ్రీదేవి పులిచెర్ల సిడిపిఓగా బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినూతశ్రీ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని బంగారుపాళ్యం, యాదమరి అంగన్‌వాడీ కేంద్రాలను నిత్యం పర్యవేక్షిస్తానన్నారు. అంగన్‌వాడీ కూర్యకర్తలు, హెల్పర్లకు వారి సమస్యలపై వెంటనే స్పందిస్తానన్నారు.

పాలసముద్రం రూటే సపరేటు

- పార్టీ సమావేశంగా మారిన మండల సర్వసభ్య సమావేశం
- సమావేశంలో దర్జాగా కూర్చొన్న అధికార పార్టీ నాయకులు
- మిన్నకుండిపోయిన అధికారులు

పాలసముద్రం, జూన్ 12 ప్రభాతవార్త: సాధారణంగా మండల సర్వసభ్య సమావేశాలకు ప్రతిప్రతినిధులు, అధికారులు హాజరై సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుంది. అయితే పాలసముద్రం మండలంలో ఇందుకు విరుద్ధంగా అధికార పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులతో పాటు సమావేశానికి హాజరై అధికారులకు కలిసి సమస్యలపై చర్చించి పాలసముద్రం మండలం రూటే సపరేటు అని జిల్లా మొత్తానికి చాటి చెప్పారు. అధికారులు సైతం అధికార పార్టీ నాయకులను సమావేశం నుండి నిష్క్రమించాలని సూచించిన దాఖలాలు కన్పించలేదు. పాలసముద్రం ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిపి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల టిడిపి నాయకుడు హాజరై ప్రజాప్రతినిధులతో పాటు కూర్చొని అధికారులతో సమీక్షించినా అధికారులు ఎవ్వరు ఆ నాయకుడిని సమావేశం నుండి వెళ్ళిపోవాలని చెప్పలేదు. ప్రతిపక్షంలో వున్న వైకాపా ప్రజాప్రతినిధులు సైతం సమావేశంలో ఏమి మాట్లాడకపోవడంతో ఆ టిడిపి నాయకుడు సమావవేశం ముగిసే వరకు వుండి అధికారులతో మండల అభివృద్ధిపై జరిగిన సమీక్షలో పాల్గొన్నారు. సమావేశంలో జడ్పీటిసీ అన్బుగలన్, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, గ్రామ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నెలలోగా డంపింగ్‌యార్డ్‌లో చెత్త తొలగింపు - మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త వచ్చే నెలలోపు కుప్పం మోడల్ కాలనీ వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్‌లో ఉన్న చెత్తను పూర్తిగా తొలగిస్తామని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన డంపింగ్‌యార్డ్‌లో జరుగుతున్న లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తమిళనాడుకు చెందిన సంస్థ ద్వారా డంపింగ్‌యార్డ్‌లో ఉన్న తడి,పొడి చెత్త, వ్యర్థాలను వేరు చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమీషనర్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త మంగళం -పలమనేరు లైన్‌లో మరమ్మత్తుల కారణంగా ఈనెల 14,15 తేదీల్లో ఉదయం 12గంటలనుంచి, సాయంత్రం 6గంటల దాకా కుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో అత్యవసర వేళల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండవచ్చని ప్రజలు ఇందుకు సహకరించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ తెలిపారు.

సుపరిపాలన ఘనత సిఎం చంద్రబాబుకే - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జూన్ 12 ప్రభాతవార్త దేశంలోనే సుపరిపాలనను పరిచయం చేసిన ఘన సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సిఎం చంద్రబాబునాయుడు పాలన సామర్థ్యం ఒక ప్రామాణికంగా నిలిచిందన్నారు. అందుబాటులో ఉన్న వనరుల్ని సమర్థంగా వాడుకుంటూ దేశంలోనే ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమిత చేసి ఆపై పాలనపై దృష్టి పెట్టడంతోనే చంద్రబాబు అద్భుతాలు సాధించుతున్నారన్నారు. దేశంలో టెక్నాలజీని వాడకంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. కాల్ సెంటర్లను ఏర్పాటుచేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంకు సిటిజన్ చార్టర్ ఏర్పాటుచేశారన్నారు.

శాంతిపురంలో దేశం నేతల సంబరాలు

శాంతిపురం, జూన్12 ప్రభాతవార్త కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది కావడంతో శాంతిపురంలో తెదేపా శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. నేతలు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, మాజీ వైస్ఎంపిపి ఉదయ్, నేతలు ఎల్.జయరాంరెడ్డి, మణి, రమేష్, చంద్రశేఖర్, గోపాల్, శివ, బాలు, నాగరాజు, చిట్టి, అనసూయ, పుష్ప, నారాయణస్వామి, శ్యామలమ్మ, సరిత, హేమావతి పాల్గొన్నారు.అలాగే రాళ్లబూదుగూరు గురువారం రాత్రి దేశం నేతలు సంబరాలు జరుపుకున్నారు. నేతలు బసవరాజు, కుమార్, మణి, జయరాజ్, నారాయణ, కలీం, మూర్తి, రాము పాల్గొన్నారు.

మద్యం షాపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

వి.కోట, జూన్ 12 ప్రభాతవార్త

ఆంధ్ర- కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఓ మద్యం షాపు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని కర్ణాటక పోలీసులు గుర్తించారు. పంతనహళ్లి సమీపంలో పలు దుకాణం వద్ద ఈసంఘటన చోటు చేసుకుంది. అధిక మద్యం సేవించి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడా లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో కర్ణాటక పోలీసులు విచారణ మొదలు పెట్టారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తరలించారు.

విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు పంపిణీ

కల్లూరు, జూన్ 12, ప్రభాతవార్త విద్యార్థులకు విద్యా సమపార్జనలో విద్యా మిత్ర కిట్లు దోహదకారిగా ఉంటాయని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, షూస్, బెల్టు, టై బ్యాగులను విద్యా మిత్ర కిట్లు రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్నారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లూరు ప్రధానోపాధ్యాయులు శ్రీ వాణి, పాఠశాల చైర్మన్ హెచ్ఎస్ అష్రఫ్‌లు పేర్కొన్నారు. గురువారం ఉదయం పాఠశాల ఆవరణంలో పాఠశాల విద్యార్థులకు ఎస్ఆర్‌కె విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మాజీ ప్రధానోపాధ్యాయుడు మృతి

సదం, జూన్ 12, ప్రభాతవార్త

సదం ప్రాథమిక పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయుడు నల్లప రెడ్డి కృష్ణారెడ్డి గురువారం అనారోగ్యంతో మరణించారు. ఆయన రాష్ట్ర మాజీ మంత్రి పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమీప బంధువు, ఆయన మృతి పట్ల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ,తంబలపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, వైసీపీ నాయకులు రెడ్డిపరెడ్డి, ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ నాలి కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ ధనంజయ రెడ్డి, మాజీ ఎంపీపీలు ఇందిరమ్మ, వెంకటస్వామి తదితరులు సంతాపం తెలిపారు.

వరసిద్ధుని సన్నిధిలో ఏపీ ఎన్విరాన్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్

కాణిపాకం, మే 4 ప్రభాతవార్త:

రాష్ట్ర ఎన్విరాన్మెంట్ (ఏపీఇఎంసీఎల్) ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత పుణ్యసముద్రం జట్టు

కాణిపాకం, జూన్ 12 ప్రభాతవార్త:

కాణిపాకం సమీపంలోని చిగరపల్లె క్రీడా మైదానంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో పుణ్యసముద్రం జట్టు విజేతగా నిలిచింది. గత నెల రోజులుగా చిగరపల్లె క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయి. ఈమేరకు గురువారం ఫైనల్ పోటీలు జరిగాయి. ఇందులో పుణ్యసముద్రం, అరుణానగర్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. రసవత్తరంగా జరిగిన ఈపోటీల్లో పుణ్యసముద్రం జట్లు విజేతగా నిలిచింది. దీనితో విజేత జట్టుకు నిర్వహకులు మొదటి బహుమతిగా 15 వేల రూపాయలను, రన్నర్ జట్టు అరుణానగర్ జట్టుకు 10 వేల రూపాయలను బహుమతిగా అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ ప్లేయర్‌లకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో క్రికెట్ టోర్నీ నిర్వహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి కిట్ల పంపిణీ

తవణంపల్లె, జూన్ 12 ప్రభాతవార్త:

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి కిట్లను గురువారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.మండలంలోని 66 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వ సరఫరా చేసిన సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి కిట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం తవణంపల్లె ప్రాథమిక పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు వున్న సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి కిట్లను మండల విద్యాశాఖాధికారి హేమలత పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు సచివాలయ ప్రాంగణాల్లో మెగా డ్రిల్

- జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ప్రాంగణాల్లో శనివారం మెగా డ్రిల్ కార్యక్రమంను ఘనంగా నిర్వహించడానికి పక్కాగా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. యోగా నిర్వహణ ఏర్పాట్లపై డిఆర్ఓ మోహన్‌కుమార్ గురువారం తన ఛాంబర్ నుండి అర్డీఓలు, తహసిల్దార్లు మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సమీక్షలో డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 8.60 లక్షల మంది యోగా కార్యక్రమంపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ మేరకు శుక్రవారం అన్ని గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం సమయంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 120 మాస్టర్ ట్రైనర్స్, 5,700 మెగా ట్రైనర్స్ 5,700 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది యోగా కార్యక్రమాల్లో తప్పక పాల్గొనాలని డిఆర్ఓ ఆదేశించారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థులతో యోగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఇక్కడి నుండి పాఠశాలను తరలించనీయం

- ఆగ్రహారం స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ మురకంబట్టు ఆగ్రహారం గ్రామంలో వున్న పాఠశాలను మూసి వేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అక్కడి విద్యార్థుల తల్లిదండ్రులు తిరగబడ్డారు. ఇప్పటి వరకు తమ విద్యార్థులకు అనుకూలంగా వున్న పాఠశాలను ఆగ్రహారంలోనే కొనసాగించాలని, ఈ పాఠశాలను ఇతర ఏ పాఠశాలలో విలీనం చేయవద్దని డిమాండ్ చేస్తూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డెక్కారు. ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని పాఠశాల గేటుకు తాళాలు వేసి రోడ్డుపై బైఠాయించి తమకు ఏ మాత్రం అనుకూలంగా లేని మురకంబట్టు పాఠశాలలో ప్రస్తుతం వున్న ఆగ్రహారం పాఠశాలను విలీనం చేస్తే ఎలాగని నిలదీశారు. ప్రస్తుతం వున్న ఆగ్రహారం పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు వున్నాయని, అయితే మురకంబట్టు పాఠశాలకు తమ విద్యార్థులు వెళ్ళడానికి రహదారి సౌకర్యం సైతం లేదని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై విచారించి తమ పాఠశాల ఇతర పాఠశాలలో విలీనం చేయకుండా ఇక్కడే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పలమనేరులో కూటమి సంబరాలు

పలమనేరు, జూన్ 12 ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావడంతో గురువారం కూటమి పార్టీల నాయకులు పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ కార్యాలయంలో పెద్ద కేక్ కట్ చేసి ఇతర నేతలు, కార్యకర్తలకు తినిపించి హంగామా సృష్టించారు. రాష్ట్రంలో ఆరాచక, అవినీతి పాలనను అంతం చేసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంకు పాలన కట్టబెట్టడంతో రాష్ట్రం అభివృద్ధి వైపు దూసుకువెళ్తున్నదన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి దిశ వైపు పరుగెడుతుందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసూకుంటూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒక్క ఏడాదిలోనే ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ సంబరాల్లో సీనియర్ తెలుగుదేశం నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యం గౌడ్, పలమనేరుటౌన్, రూరల్, గంగవరం, పెద్దపంజాణి మండలాల పార్టీ అధ్యక్షులు ఆర్‌బిసి కుట్టీ, నాగరాజురెడ్డి, సోమశేఖర్‌గౌడ్, ఆనంద్‌లతో పాటు నాయకులు గిరి, నాగరాజు, ఖాజా, ప్రతాప్, అమర నాథరెడ్డి, రూపేష్, కిరణ్, సుధాకర్‌లు, జనసేన నాయకులు దిలీప్, హరీష్, నాగరాజు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ఓటర్ల జాబితా క్లైములు పక్కాగా పరిష్కారం

జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త: ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లైములను సకాలంలో స్పందించి పక్కాగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్ఓ చాంబర్‌లో గురువారం డిఆర్ఓ మోహన్‌కుమార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ డిఎంహెచ్ఓ, డిఆర్‌డిఎ పిడిల సమన్వయంతో ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా మృతి చెందిన వారి జాబితాను సిద్ధం చేయడం జరిగిందన్నారు. మృతి చెంది వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రక్రియను అన్ని నియోజకవర్గాల్లో చేపట్టడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బిఎల్ఓలు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లైముల పరిష్కారానికి చర్యలు పట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం కోసం బిఎల్ఎ-2 ఫారంను పూర్తి చేసి సమర్పించాలని డిఆర్ఓ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కోసం 15,497 దరఖాస్తులు అందగా 1,595 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయని వివరించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, వైఎస్ఆర్‌సిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, ఎలక్షన్ సెక్షన్ సూపరిటెండెంట్ వాసుదేవన్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : ఎంఇఓ

చౌడేపల్లి, జూన్ 12 ప్రభాతవార్త విద్యార్థి లోకానికి ప్రభుత్వమందించే పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యతో చక్కటి భవిష్యత్తును తీర్చుదిద్దుకోవాలని ఎంఇఓ కేశవరెడ్డి అన్నారు. స్థానిక ఎంపిపి పాఠశాల(తెలుగు)లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు కిట్లను పంపిణీ చేశామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, హరినాథ్, మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

వెదురుకుప్పం, జూన్ 12 ప్రభాతవార్త : రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని తెలుగు దేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్దగల కూడలిలో కూటమి నాయకులు సుపపారి పాలకు ఏడాది కావడంతో బాణాసంచా పేల్చి, కేక్ కత్తరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్రంను ప్రగతి పథంలో నడపడంకు పథకాలు రచించి ముందుకుసాగుతున్నారని చెప్పారు. అనంతరం కేక్ కత్తరించి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు లోకనాధ రెడ్డి, నియోజకవర్గం యువత తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్‌చంద్, నాయకులు నరసింహ యాదవ్,బాబునాయుడు, హనుమంత రెడ్డి, శ్రీరాములు రెడ్డి, రవి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

వెదురుకుప్పం, జూన్ 12 ప్రభాతవార్త :

అన్నదాత సుఖీభవ పథకం కొరకు రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వనిత తెలిపారు. వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోతున్న అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి కొరకు రైతులు ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కష్టమర్) తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క రైతు తమ పరిధిలోగల రైతు సేవా కేంద్రాలకు వెళ్ళి తమ వివరాలు ఇచ్చి రైతు ఈకేవైసీ చేయించు కోవాలని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ సమాజానికి ముక్కు

పుంగనూరు జూన్ 12, ప్రభాతవార్త సమాజంలోని బాల కార్మికులను "పని వద్దు బడి ముద్దు" అని చదువుకునే వయసులో పిల్లలను నిర్లక్షం చేయకుండా ప్రతి ఒక్కరు వారికి అండగా నిలవాలని పుంగనూరు జూనియర్ సివిల్ జడ్జి కె. క్రిష్ణవంశి పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ బాల కార్మికల వ్యతిరేక దినోత్సవాన్ని కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్ నందు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికలను అన్ని విధములుగా చదువుకొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పరంగా వారికి ఇచ్చే సదుపాయాలను వాళ్ళకు చేరవేయవల్సిందిగా కోరారు. విద్యాహక్కు సమావేశంలో ప్రధానో పాధ్యాయుని ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలి

పుంగనూరు రూరల్, జూన్ 12, ప్రభాతవార్త

మండలంమార్లపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని ఒకటి. రెండు తరగతులు అక్కడే ఉంచి, 3,4,5, తరగతులను ప్రక్క గ్రామమైన సింగరీ గుంట గ్రామ పాఠశాలను మార్చడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఖండిస్తూ పాఠశాల వద్ద నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంఈఓ నటరాజ మాట్లాడుతూ మార్లపల్లి గ్రామంలో పాఠశాల సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 12 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందిం చారు. ఈమేరకు తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన రాజారెడ్డి అనే భక్తుడు ఈ పథకానికి 1,01.116 విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబ సభ్యులతో కలసి టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం విస్తరణకు నిధులివ్వండి:

అభివృద్ధి పనుల ఫైళ్ళను క్లియర్ చేయండి

గుడిమల్లంను శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం చేయండి

శ్రీకాళహస్తి.జూన్ 12 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుడిమల్లం ఆలయాన్ని అనుబంధం చేయాలని, అభివృద్ధి పనుల ఫైళ్ళను త్వరిత గతిన అనుమతించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గురువారం విజయవాడలోని కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌ను కలసి వినతి పత్రం అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైలాసగిరి పర్వత పంక్తుల్లో రోడ్ల నిర్మాణానికి సంబంధించి టెండర్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు

తిరుపతి డివిజన్

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి

శ్రీకాళహస్తిరూరల్ జూన్ 12 ప్రభాతవార్త

వ్యవసాయ శాస్త్రవేత్తలు,అనుబందశాఖాలాది . కారులు, సలహాల సూచనల మేరకు రైతులు సాగు చేయడం ద్వారా అనవసర ఖర్చు తగ్గించుకుని మంచి ఆదాయం పొందవచ్చునని శ్రీకాళహస్తి శాసనసభ్యుల సతీమణి బొజ్జల రిషితారెడ్డి అన్నారు.గురువారం రాస్‌కృషి విజ్ఞాన కేంద్రం న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా మండలంలోని అక్కుర్తి,కాపుగునేరి గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయాధికారులు రైతులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు.ఊరందూరులో జరిగిన కార్యక్రమంలో ఆమె హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిగి ప్రతి ఒక్కరు ఆయా పథకాలను వినియోగించుకోవాలన్నారు. .ప్రభుత్వ రాయితీ మీద అందిస్తున్న యూరియా అందజేశారు.రైతులు ప్రస్తుత ఖరిఫ్ సీజన్‌లో పండించే పంటలో నూతన రకాలు చేపట్టవల్సిన యజమాన్య పద్ధతులు సాగు ఖర్చులు తగ్గించే భూసార పరీక్షా అధారిత ఎరువుల యాజమాన్యం,డ్రమ్ సీడ్ ద్వారా నేరుగా వరి నాటే విధానం పచ్చ రొట్టా పంటల సాగు జీవన ఎరువుల విధానం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు.అదే విధంగా పాడి పశువులు,గొర్రెలు,కొళ్ళ పెంపకంలో చేపటాల్సిన పద్ధతులు మొదలైన అంశాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చరర్ అధికారి సుధాకర్‌రెడ్డి,కన్నలి ప్రతాప్‌రెడ్డి,మల్లిశ్వరి రైతులు తదితరులు పాల్గొన్నారు

సామూహిక అక్షారాభ్యాసం

శ్రీకాళహస్తిరూరల్ జూన్ 12 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం నందు గురువారం సామూహిక అక్షారాభ్యాసం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రేణిగుంట స్త్రీశిశుసంక్షేమాధికారి కృష్ణవేణి పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. ఈసమయంలో పిల్లలకు మెదడు అభివృద్ధి 80 శాతం మెరగవుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఇఓ దయాకర్ ఉపాధ్యాయులు శోభారాణి, సూపర్‌వైజర్ భారతి,విజియా,సంధ్య,అన్నపూర్ణ,శారద,వైష్ణవి పిల్లలు వారి తలిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాతరలు నాయకుల హాజరుతో సందడి

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 12 ప్రభాతవార్త శ్రీకాళహస్తి

మండలంలోని పలు గ్రామాల్లో జాతర సంబరాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపధ్యంలో గ్రామాల్లో వేసవి సందర్భంగా పొంగళ్ళు,జాతరలు నిర్వహించుకుంటున్నారు. దాంతో గ్రామాలకు వివిధ పార్టీల నాయకులు హాజరౌతున్నారు. ఓ వైపు సంబరాలు మరో వైపు నాయకులు హాజరుతో ఉత్సాహం చోటు చేసుకుంటుంది. ఈ నేపధ్యంలో ఊరందూరు దళిత వాడలోనూ, మర్రిమాకుల చేను కండ్రిగలో పాండురంగ స్వామి తిరునాళ్ళు సందర్భంగా అగ్నిగుండం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి, మాతృమూర్తి బొజ్జల బృందమ్మలు హాజరయ్యారు. దాంతో గ్రామాల్లో ఉత్సవాల్లో కార్యకర్తల సంబరాలు చోటు చేసుకున్నాయి. ఎంఎంసి కండ్రిగ లో పాండురంగస్వామి తిరునాళ్ళు సందర్భంగా యువకులు ఉత్సహంగా పాల్గొన్నారు.యువకులు పసుపు పచ్చని వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేసారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిట్‌ల పంపిణి

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాఠశాలల పున: ప్రారంభం సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన కిట్‌లను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి విద్యార్థులకు పంపిణి చేసారు.కిట్‌లలో యూనిఫారం, బెల్టు,పుస్తకాలను పొందుపరచారు.వాటిని విద్యార్థులకు అందించారు.ఈ సందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించుటకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించుటకు సత్ఫలితాలను సాధించుటకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఉపాధ్యాయులు సరోజ,రమేస్‌రెడ్డి,మధు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలసి కట్టుగా పని చేద్దాం! పార్టీని పది కాలాల పాటు రక్షించుకుందాం!!

తొట్టంబేడు,జూన్ 12 ప్రభాతవార్త కలసి కట్టుగా పని

చేసి పార్టీని పది కాలాల పాటు రక్షించుకుందామని తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అన్నారు. గురువారం మండలంలోని వాడ వాడల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది అయిన సందర్భంగా సంబరాలు ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా మండలంలోని నాయకులందరూ కలసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. చిన్న సింగమాల వీరభద్రస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు మండలంలోని నాయకులందరూ హాజరయ్యారు.ఈ సందర్భంగా రావిళ్ళ మునిరాజానాయుడు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అవిశ్రాంతంగా శ్రమిస్తుండగా నియోజకవర్గంలో యువ నాయకుడు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వినూత్న పథకాలతో ముందుకు వెళుతున్నారన్నారు. తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీకి పెట్టని కోట గోడవలె ఉందన్నారు. మాజీ మండలాధ్యక్షుడు గాలి మురళినాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి,కన్నలి ప్రవీణ్‌రెడ్డి,సునీల్,లెక్కల మురళినాయుడు,సీనియర్ నాయకులు బూత్ ఇన్‌చార్జి గుర్రప్ప, సర్పంచ్ మాధవి,మంగారెడ్డి,కొన్నలి రమేష్,మునిరత్నం,భాస్కర్,వెంకటసుబ్బయ్య,కొప్పల సుబ్రమణ్యం, శ్రీనివాసులు,చెంచయ్య,వాసునాయుడు,యువత అధ్యక్షుడు పవన్,మహిళా అధ్యరాలు రమాదేవి,ఆయ కట్టు చైర్మెన్ కమల్‌నాథ్,న్యాయవాది కమల్‌కుమార్,సుశేఖర్‌నాయుడు,శేషమనాయుడు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన తెలుగుదేశం నాయకులు

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ఐదేళ్ళు పరిపాలించిన వైకాపా పాలనలో అప్పటి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి తెలుగుదేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులపై అక్రమ కేసులు బనాయించారని ఇప్పటికి తాము కోర్టుకు హాజరు కాక తప్పటం లేదని కాసరం రమేష్ వివరించారు. గురువారం కోర్టుకు హాజరైన నాయకులు న్యాయస్థానం ఎదుట వాయిదా తీసుకోవటం జరిగింది. పార్టీ అధిష్టాన వర్గం పిలుపుమేరకు వైకాపా పాలనలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నారాచంద్రబాబునాయుడును అరెస్టుకు నిరసనగా శాంతి యుత వాతావరణంలో ఆందోళన చేస్తుంటే అప్పటి శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి ఆదేశాలతో పోలీసులు 307 కేసును నమోదు చేసి ముప్పు తిప్పలు పెట్టారన్నారు. కోర్టుకు హాజరైన వారిలో కాసరం రమేష్, అక్షింతల కృష్ణయాదవ్, వినయ్, బషీర్, జగదీశ్వరరెడ్డి, బాలాజి, కృష్ణమనాయుడు, పసల రామకృష్ణ,సుజిత్‌రెడ్డి కోబాకు లక్ష్మణ్ యాదవ్, రాజేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపక్కన చెట్లు నాటిన నాయకులు

తొట్టంబేడు,జూన్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా తొలిఅడుగులో భాగంగా గురువారం రాష్ట్ర బిసి విభాగం కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు సారధ్యంలో మండలంలోని రోడ్డుపక్కన చెట్లు నాటే కార్యక్రమాలను చేపట్టారు.సంక్షేమం అభివృద్ధి జవాబుదారి తనంతో సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబునాయుడు పరిపాలన పది కాలాల పాటు సాగాలని కోరుతూ పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపధ్యంలో సూపర్ సిక్స్ పథకాల్లో ముఖ్యమైనది తల్లికి వందనం అని అన్నారు. దానిని ఏడాది అయిన సందర్భంగా విడుదల చేయటం చంద్రబాబు జవాబుదారి తనానికి నిదర్శనం. .ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం నాయకులు మిన్నల్ రవి, మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, బిజెపి నాయకులు అమర్‌నాథ్,భాస్కర్,సంజాకుల మురళికృష్ణ, శివ, చంద్రబాబు,కృష్ణయ్య, సుబ్రమణ్యం, రవి తేజ, మారయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.

వైకాపా మండల అధ్యక్షునికి సన్మానం

తొట్టంబేడు, జూన్ 12 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం వైకాపా అధ్యక్షుడుగా ఇటీవల ఎన్నికైన డాక్టర్ కోగిల సుబ్రమణ్యంను గురువారం శ్రీకాళహస్తీశ్వరస్వామి ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు సారధ్యంలో ఘనంగా సత్కరించారు.ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేనపుడు పార్టీని కాపాడుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.ఈ కార్యక్రమాల్లో శ్రీవారి సురేష్,పఠాన్ ఫరీద్ ఖాన్, మున్నారాయల్,శరవణ కుమార్, ఉదయ్,రామచంద్రయ్య,రవి, జుంలేషా, గోపి,కొల్లురూ హరినాథ్ నాయుడు,పెరుమాళ్‌చౌదరి,బాబు,సోము,ఆశాకిరణ్,రమణారెడ్డి,మునికుమార్,సుధీర్,ప్రసాద్‌పాల్గొన్నారు

విద్యతోనే దేశ ప్రగతి

రామచంద్రాపురం, జూన్ 12 ప్రభాతవార్త: విద్యతోనే దేశం, రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తాయని టిడిపి అధికార ప్రతినిధి చినబాబు అన్నారు. గురువారం కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను, పాఠ్య పుస్తకాలు, యూనిఫారమ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సబాపతి, ఉపాధ్యాయులునాగేశ్వరరావు,శోభారాణి,చంద్రశేఖర్‌నాయక్,కామేశ్వరి,జయశ్రీ, విజయలక్ష్మి,పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన తహసీల్దార్‌కి సన్మానం

విజయపురం,జూన్ 12 ప్రభాతవార్త: విజయపురం మండల తహసీల్దార్ ఎస్.కిరణ్‌కు గురువారం స్థానిక కార్యాలయంలో సిబ్బంది శాలువ కప్పి పూలమాల వేసి సన్మానించి అభినందనలు తెలిపారు. వారు డిప్యూటీ తహసీల్దార్ కేడర్‌లో విజయపురం మండల తహసీల్దార్‌గా గత కొంత కాలంగా పని చేస్తున్నారు. ప్రస్తుతం వారికి ప్రభుత్వం పదోన్నతి కల్పించడంతో గురువారం ఆయనను కార్యాలయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మార్ కొండయ్య, వీఆర్‌వోలు మేఘనాథం, వెంకటేశులు, చంద్రయ్య, వివేకానంద, విజయకుమార్, దొరస్వామి, పలువురు గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం

విజయపురం, జూన్ 12 ప్రభాతవార్త: మండలకేంద్రమైన విజయపురం అంగన్‌వాడీ కేంద్రంలో నగరి ఐసీడీఎస్ సీడీపీవో పి.ఇందిరా ప్రియదర్శిని ఆధ్వర్యంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆట పాటలతో పాటు అక్షరాభ్యాసం నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, విజయ, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్ వారి ఆగడాలు అరికట్టండి

పుత్తూరు రూరల్, జూన్ 12 ప్రభాతవార్త: పుత్తూరు రూరల్ ఏరియా ఆస్పత్రి నుంచి పేషెంట్లను వివిధ ఆస్పత్రులకు తీసుకెళ్లే ప్రైవేటు అంబులెన్స్ వారి ఆగడాలను అరికట్టాలంటూ స్థానిక టీడీపీ నాయకులు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మంజులకు వినతిపత్రం అందించారు. ఆస్పత్రికి వెళ్లిన వారు ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల కారణంగా పేషెంట్లు ఎదుర్కొనే సమస్యలపై వస్తున్న పిర్యాదులను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరి ఏరియా ఆస్పత్రి గతంలో కంటే ప్రస్తుతం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. రోగులు కూడా ఆస్పత్రిపై నమ్మకంతో అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. ప్రభుత్వం పేషెంట్లకు తగిన విధంగా మందులు, వైద్య పరికరాలు సరఫరా చేస్తూ ఎవరికి ఎలాంటి సమస్య లేకుండా చూస్తోందన్నారు. 24 గంటలు ఆస్పత్రిలో పేదలకు వైద్యసేవలు అందే విధంగా ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ఆస్పత్రికి రెండు అంబులెన్స్ ఉన్నా వాటికి ఫ్రీజర్ సౌకర్యం లేదన్నారు. త్వరలో ఆ అంబులెన్స్ పేషెంట్లకు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలోవైద్యులు కార్తీకేయన్, మాజీ ఆలయచైర్మన్ కృష్ణారెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, జిల్లా అధికార ప్రతినిధి జ్యోతినాయుడు, రూరల్ పార్టీ అధ్యక్షులు జవహర్‌రెడ్డి, పట్టణ పార్టీ మాజీ కార్యదర్శి గుణశేఖర్, నాయకులు శ్రీనివాసులు, మదన్‌కుమార్, రాజీవ్‌నగర్ మణి, లోకనాథం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెర్లోపల్లి గ్రామ పాఠశాలపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

పుత్తూరు రూరల్, జూన్ 12 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపాలిటీ చెర్లోపల్లిలో ఉన్న ఎంపీ యూపీ పాఠశాలను పక్క గ్రామాలకు మార్చవద్దంటూ పుత్తూరు మండల విద్యాశాఖ అధికారికి విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేవారు. అనంతరం పుత్తూరుపట్టణంలో ఉన్న స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 30 మంది పిల్లలు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. మా పాఠశాలను 1-5వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరా సరిపోయినంత విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో తరగతి గదులు, విద్యార్థులకు సరైనటువంటి వాష్‌రూమ్, మరుగుదొడ్లు, తాగునీటివసతి అన్ని వసతులకు పాటు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇలాంటి పాఠశాలను డి ప్రమోట్ చేస్తూ వేరే ప్రదేశంలో పిల్లలను స్కూలుకు పంపాలంటే భయాందోలనకు గురవుతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారి, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆనంగి ఆనంద్, ముని రామయ్య, సుబ్బారామయ్య, ముని రత్నం, హరి, రమేష్, ముత్తలయ్య, వసంత, గాయత్రి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

మంచి పర్యావరణ మంచి ఆరోగ్యానికి తొలి మెట్టు - డాక్టర్ రాజేశ్వరి

పుత్తూరు రూరల్, జూన్ 12 ప్రభాతవార్త: వేపగుంట గ్రామ శ్మశానంలో డా. విజయకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మన పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరి బాధ్యతని తీసుకోవాల్సిన తక్షణ అవసరాన్ని నొక్కి తెలిపారు. వాతావరణ మార్పులను ఎదుర్కొవడంలో గాలి నాణ్యతను మెరుగుపరచడంలో, జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో చెట్ల ప్రాముఖ్యమైన పాత్ర తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, దీపక్, భరత్, తిల్లు, విష్ణు, వెంకట్, సంతోష్‌లు పాల్గొన్నారు. విద్యార్థులు, గ్రామ యువకులు, స్థానిక కమ్యూనిటీస్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో ఎంజిఎం విద్యార్థి ప్రతిభ

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త

తిరుపతిలో జరిగిన ఓపెన్ టెన్సిస్ అండర్ 14 విభాగంలో శ్రీకాళహస్తి ఎంజిఎం పాఠశాల విద్యార్థి తమ ప్రతిభను చూపి విజేతగా నిలిచారు. ఓపెన్ టెన్సిస్ పోటీలు 14 సంవత్సరాల లోపు వారికి తిరుపతిలో జరిగింది.ఈ పోటీలకు చిత్తూరు,తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో 14 సంవత్సరాల లోపు పోటీల్లో ఎంజిఎం విద్యార్థి టి.గురురోహిత్ మొదటి స్థానం సాధించారు. ఆతనికి నిర్వాహకులు నగదు బహుమతితో పాటు అవార్డును అందించారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం పాఠశాలలో కరస్పాండెంట్ గుడ్లూరు మయూర్ అధ్యక్షతన అభినందన సభను ఏర్పాటు చేసారు.

ప్రజల ఆకాంక్షే ఆయన ధ్యేయం-స్వర్ణాంధ్రాయే ఆయన లక్ష్యం

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త ప్రజా సంక్షేమమే

లక్ష్యంగా స్వర్ణాంధ్రయే జీవితాశయంగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పరిపాలనకు ప్రజల మద్దతు ఉందని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంబరాల కార్యక్రమాల్లో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. రోజులో 18 గంటలు పని చేసే నాయకుడు ఒక్క చంద్రబాబునాయుడే అన్నారు.ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి కానీ నేడు స్వర్ణాంధ్ర లక్ష్యంగా పని చేస్తున్నారని వివరించారు. రాష్ట్రం కోసం కష్టపడి పని చేస్తున్న చంద్రబాబునాయుడును అభినందించాల్సిన వైకాపా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అర్థరహిత విమర్శలతో పబ్బం గడుపుకొనుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.ఐదేళ్ళు పరిపాలించిన జగన్‌ను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదన్నారు.అమరావతిని వేశ్యల రాజధానిగా అభివర్ణించటం మహిళల పట్ల ఆయనకున్న భావానికి నిదర్శనం అన్నారు. నేడు అమ్మకు వందనంలో విద్యార్థులకు నిధులు జమ చేసారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలుకు నిర్ణయించారు.ప్రజల ఇళ్ళ వద్దకే రేషన్, ప్రతి నెల 1న ఇంటి వద్దకే పెన్షన్లు ఇవి ప్రజా సంక్షేమ పథకాలు కావా?అని ప్రశ్నించారు.ఈ నెల 20న అన్నదాతలకు సుఖీభవ పథకం నిధులు అందజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించటం పథకాల అమలులో ఆయనకు గల విజన్‌కు నిదర్శనమన్నారు. నేడు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తు యువతదే అని రాబోవు రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాలోకేష్ అని ఎస్‌సివి నాయుడు జోస్యం చెప్పారు.ప్రభుత్వం బలోపేతం కావటానికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పరుగులు తీస్తుంటే పార్టీని బలోపేతం చేయటానికి యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. సమావేశంలో సంబరాల్లో యువ నాయకుడు సత్రవాడ ప్రవీణ్‌కుమార్, ప్రకాష్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్‌నాయుడు, ఈర్ల కిషోర్, భాస్కర్‌నాయుడు మాజీ ఎంపిపి సుబ్రమణ్యం, సర్పంచ్ గాలి బాలాజినాయుడు, ఆరునాయుడు,ఢిల్లి, ప్రతాప్, సుదర్శనం నాయుడు చందు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకాళహస్తిలో షర్మిల సభ

శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయటానికి రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం లో కార్యకర్తలు ప్రజలనుద్దేశించి మాట్లాడటానికి రానున్నారు.ఈ నేపధ్యంలో ఏర్పాట్లలో నియోజకవర్గ ఇన్ చార్జి తలపా దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు నాయకులు పరుగులు తీస్తున్నారు.నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకు నడుస్తున్నారు. ఈ ప్రజా అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకొనుటకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుకు రావటానికి వారిని ప్రోత్సహించుటకు షర్మిలరెడ్డి పర్యటిస్తున్నారు. మరో వైపు మాజీ సిఎం జగన్మో హనరెడ్డి తమకు జరిపిన అన్యాయంపై శివమెత్తిన షర్మిల ప్రజలకు వివరిస్తున్నారు. .గురువారం జరిగిన కార్యక్రమాల్లో నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదర్‌రెడ్డి, పిపిసి ఉపాధ్యక్షులు దొడ్డరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురుమూర్తి, శబరి రాజన్, దేవదానం, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిందర్, శ్రీకాళహస్తికి చెందిన నాయకులు సురేంద్రరెడ్డి, నవీన్,అంటోని, అరుణ్, మహేష్, చందు,బద్రిపాల్గొన్నారు.

విద్యతోనే దేశ ప్రగతి

రామచంద్రాపురం, జూన్ 12 ప్రభాతవార్త: విద్యతోనే దేశం, రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తాయని టిడిపి అధికార ప్రతినిధి చినబాబు అన్నారు. గురువారం కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను, పాఠ్య పుస్తకాలు, యూనిఫారమ్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సబాపతి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శోభారాణి, చంద్రశేఖర్ నాయక్, కామేశ్వరి, జయశ్రీ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దొంగ స్వామి,అతని అనుచరుల నుంచి ప్రాణరక్షణ కల్పించండి

– మా భూమి మాకు ఇప్పించండి– ఐదు కుటుంబాలకు చెందిన బాధిత రైతుల ఆవేదన

తిరుపతి హెల్త్, జూన్ 12 ప్రభాతవార్త : దొంగ స్వామి, రౌడీ షీటర్ అలియాస్ కొండ సురేంద్రబాబు నుంచి మా ఐదు కుటుంబాలకు ప్రాణ రక్షణ కల్పించాలని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఐదు కుటుంబాలకు చెందిన బాధిత రైతులు వై. నాగిరెడ్డి, గంగిరెడ్డి, రమేష్‌రెడ్డి,మహేష్‌రెడ్డి, హేమాద్రి, ప్రమీలమ్మ మాట్లాడుతూ కొండ సురేంద్రబాబు అనే వ్యక్తి సాధారణ వ్యక్తి అన్నారు. దొంగస్వామి అవతారం ఎత్తి మా తాత ముత్తాతలకు చెంది రిజిష్టర్ కాబడి రైతువారి పట్టా కలిగి తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు గ్రామ లెక్కదాఖలో పైమాషి నెం. 464లో 16 ఎకరాల పొలాన్ని కబ్జాచేసేందుకు ప్రయత్నించడం జరిగిందన్నారు. ముందుగా కొంత భూమిని కౌలుకు చేస్తానని మా కుటుంబంలోని ఒక సభ్యుని మోసం చేసి చిన్నగా మా పొలంలో ఒక గుడిసి వేసి అందులో వరాహి అమ్మవారి విగ్రహాన్ని పెట్టడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి దొంగస్వామి కొండ బాబు అలియాస్ సురేంద్రబాబుపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మా పొలాన్ని దొంగస్వామి నుంచి ఇప్పించి మా ఐదు కుటుంబాలకు ప్రాణ రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు

సత్యవేడు, జూన్ 12 ప్రభాతవార్త: బాబుతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం తిరుపతి పార్లమెంట్ ఐ టీడీపీ అధ్యక్షుడు యాచేంద్రనాయుడు నాగలాపురంలో ఐ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సంతోష్‌నాయుడు, మండల ఐ టీడీపీ అధ్యక్షులతో సమ

గూడూరు డివిజన్

251కోట్లుతో అభివృద్ధి పనులు : నెలవల

నాయుడుపేట, జూన్ 12 ప్రభాతవార్త: సూళ్ళూరుపేట నియోజకవర్గంలో 251కోట్లు రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూరైన సందర్భంగా నాయుడుపేట పట్టనంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం మాట్లడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 10లక్షల 50వేలకోట్లు రూపాయలు అప్పుల ఊబిలోనికి నెట్టేశారని తెలియజేశారు. ముఖ్యమంత్రి రాష్ట్రఆర్థిక ఇబ్బందులు అధికమిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరర్చుతున్నాడని తెలిపారు. చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధిని చూచి ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈకార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు మాజీ ఏఎమ్‌సి చేర్మేన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఊయ్యాల ప్రవీణ్,తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన సదస్సు

గూడూరు, జూన్ 12 ప్రభాతవార్త : రూరల్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఏడిజే పవన్ కుమార్ పిల్ల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు పిల్లల్ని బాగా చదివించి దేశానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని 6-14 సంవత్సరాల వయసుగల బాల బాలికలను ఎటువంటి పనులలో చేర్చుకోకూడదు, అలాగే ఎలాంటి బలవంతపు పనులు చేయించకూడదు అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏడవ అడిషనల్ జడ్జి కె. వెంకట నాగ పవన్, సబ్ జడ్జి బి. రాజేష్, అడ్వాకేట్‌లు ఎ. కోటేశ్వర రావు, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఓజిలి, జూన్ 12 ప్రభాతవార్త: విద్యార్థినులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగాలని ప్రస్తుత సమాజంలో విద్యార్థులదే ప్రధాన పాత్ర అని కాబట్టి విద్యార్థులు అందరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కూటమి ప్రభుత్వమే విద్యకు పెద్ద పీట వేస్తోందని కూటమి ప్రభుత్వంతో విద్యారంగ అభివృద్ధి సాధ్యపడుతోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ దార అంకయ్య తెలియజేశారు. గురువారం ఓజిలి మండల పరిధిలోని కురుగొండ గ్రామంలో ఉన్న పాఠశాలల్లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ దార అంకయ్య,కూటమి నాయకుల ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్స్ పేరిట 150 కిట్లను ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమపథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం : ఎమ్మెల్యే

సూళ్ళూరుపేట, జూన్ 12 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను స్ఫూర్తిగా తీసుకుని చంద్రబాబునాయుడు సారథ్యంలో సంక్షేమ పథకాల అమలును సవాలుగా తీసుకుని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక రైల్వేగేట్ సమీపంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే వివరించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతిఒక్కరికీ అందే విధంగా చర్యలు చేపడుతున్నారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పి.మాధవనాయుడు, ఎజి కిషోర్, కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

చెందోడు హైస్కూలులో పండుగ సంబరాలు

కోట, జూన్ 12 ప్రభాతవార్త: మండలం చెందోడు జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో పండుగ వాతావరణం నెలకొంది. ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలను హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యా యురాలు ఎ.సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ముందుకు పోతున్నామని చెప్పారు. సబ్జెక్టుల వారీగా తమ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యాన్ని ఇవ్వడంతో విద్యార్థులకు రుచికరంగా వండిపెడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ సిహెచ్ పుట్టయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం

కోట, జూన్ 12 ప్రభాతవార్త: ఐసిడిఎస్ ప్రాజెక్టు వాకాడు, కోట, చిట్టమూరు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించినట్లు సిడిపిఓ మునికుమారి చెప్పారు. మండలంలోని చిట్టేడు అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడో సంవత్సరం వచ్చినప్పటి నుంచి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక చేయూతకు అన్వేషణ

కోట, జూన్ 12 ప్రభాతవార్త : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 అమలుకు అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే గుర్తించిన పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అవసరమైన మార్గదర్శకాలు గుర్తింపునకు శ్రీకారంచుట్టింది. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ లోగా ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టరేట్ నుంచి ఎంపిడిఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవల సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పి-4 సర్వే చేపట్టారు. కోట మండలంలోని వంజివాక, గూడలి గ్రామాలను ఎంపిక చేశారు. ఈ పేద కుటుంబాలకు బంగారు కుటుంబాలుగా నామకరణం చేశారు. వీరంతా ఎంపిక చేసిన పేద కుటుంబాల ఆర్థిక ప్రగతికి తమవంతు సహకారం అందించే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

విద్యార్థులకు విద్యా కానుక కిట్ పంపిణీ

దొరవారిసత్రం, జూన్ 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఏకోల్లు జిల్లా ఉన్నత పాఠశాల చదువుతున్న విద్యార్థులకు గురువారం బుక్స్ నోట్ బుక్స్ బ్యాగులు తరతర విద్యా సామగ్రిలను ఎంఈఓ కిష్టయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల పరిధిలోని చదువుతున్న 3060 మంది విద్యార్థులకు ఈ కిట్స్ అందిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు

గుండెపోటుతో వీఆర్ఏ మృతి!

దొరవారి సత్రం,జూన్ 12 ప్రభాతవార్త: మండలంలోని నెల్లూరుపల్లి గ్రామ వీఆర్ఏ చిన్నయ్య (58) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. స్థానికులు వివరాలు మేరకు చిన్నయ్య విధులు నిమిత్తం నెలబల్లి సచివాలయంకు వెళుతుండగా నెల్లూరుపల్లి గ్రామంలో ఒకసారిగా కుప్ప కూలాడు. వెంటనే స్థానికులు చిన్నయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శైలకుమారి, స్థానిక వీఆర్వో రమేష్, రెవెన్యూ సిబ్బంది చిన్నయ్య మృతి దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని తహశీల్దార్ అందజేశారు.

ఉచిత స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్‌ను జయించండి

గూడూరు, జూన్ 12 ప్రభాతవార్త : తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ కార్యక్రమాల ద్వారా అవగాహన పెంచుకుని క్యాన్సర్‌ను జయించాలని వైద్యాధికారి డాక్టర్ ఎం.జ్యోతి కోరారు. గురువారం చెన్నూరు పీహెచ్సీ పరిధిలోని రామలింగాపురం, చెన్నూరు గ్రామాల్లో పింక్ బస్ ద్వారా ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌ను నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్, మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ , వైద్యాధికారులు డాక్టర్ సల్మా, డాక్టర్ ఎ.లీలాకృష్ణ, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్యభాను, సర్పంచ్ ఎ.సంపూ ర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఎ.కోటయ్య, టి.రాజా, ప్రవీణ్ కుమార్, నవీన్ కుమార్, సూపర్వైజర్ ఐ.ఉమా, సిహెచ్ వోలు ఒ.గ్లోరి, నీలిమ, ఎ.పుల్లమ్మ, హెల్త్ అసిస్టెంట్ గడ్డం నాగేశ్వరరెడ్డి ఏఎన్ఎంలు ఎస్కె.జంషాబి, వి.శశికళ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు యోగా చేయాలి

బాలాయపల్లి, జూన్ 12 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం యోగా చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ కుమారి తెలిపారు. మండలంలోని వెంగమా ంబపురం జూనియర్ కళాశాలలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగా చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉంటారు అని చెప్పారు. డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానవునికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. యోగ మాస్టర్ దయాకర్, డిప్యూటీ ఎంపీడీవో మోహన్ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

వెంకటగిరి, జూన్ 12, ప్రభాతవార్త కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సంవత్సరం అయిన సందర్భంగా వెంకటగిరిలోని ఎమ్మెల్యే నివాస గృహంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకొస్తున్నట్లు చెప్పాడు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అన్నా క్యాంటీన్, గ్యాస్, తల్లికి వందనం పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, సీసీ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ ఎంపీపీ భాస్కర్ రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు ఆనంద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

వెంకటగిరి, జూన్ 12 ప్రభాతవార్త: చెన్నూరు గ్రామంలో చిన్న సమస్య విషయమై దళితులపై విచక్షణారహితంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునయ్య తెలిపారు. దళితులపై దాడులు ఆగడం లేదని ఆందోళన చెందారు. చెన్నూరు గ్రామంలో దళితులను విచక్షణ రహితంగా కొట్టి ఇబ్బంది పెట్టారని తెలిపారు. దళితులనుపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు.

అంగన్వాడి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

వెంకటగిరి, జూన్ 12 ప్రభాతవార్త: పట్టణంలోనే బంగారు పేట బీసీ కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు ఎంఈఓ బాబయ్య, సిడిపిఓ శంషాబాద్ వేగంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో నిర్వహించారు. చిన్నారులకు బియ్యంలో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికరమైన ఆహార ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పొట్టేల ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

విరివిగా రైతులకు సేవా కార్యక్రమాలు

బాలాయపల్లి, జూన్ 12 ప్రభాతవార్త: వికసిత్ కృషి అభియాన్ ద్వారా రైతులకు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు కేవీకే అధిపతి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాస్త్రవేతల ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల సహకారంతో గత 15 రోజుల నుండి వెంకటగిరి, బాలయ్యపల్లె, డక్కిలి, రాపూరు, ఓజిలి, సైదాపురం, పొదలకూరు మండలాలలో దాదాపు 50 గ్రామాలలో 18000 మంది రైతులతో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా డక్కిలి మండలం లింగసముద్రం గ్రామంలో చివరగా ఈ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భూసారా పరీక్ష రైతులకు చేసి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేంకటగిరి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డా. నాగార్జున సాగర్, ఐ.ఐ.ఆర్.ఆర్. శాస్త్రవేతలు డా. మంగళదీప్, బండెప్ప, డక్కిలి ఉద్యాన అధికారి ఆనంద్ రెడ్డి, కే.వి.కే, శాస్త్రవేతలు శ్రీనివాస రెడ్డి, రాజీవన, నాగార్జున రెడ్డి, రైతు సేవ కేంద్రం వ్యవసాయ సిబ్బంది శ్రీహరి, హరి చంద్ర ప్రసాద్, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

బాలాయపల్లి, జూన్ 12 ప్రభాతవార్త : వెంగమాంబ అంగన్వాడి కేంద్రాలు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపుసిడిపిఓ కృష్ణ మంజరి అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాంకుమార్

వెంకటగిరి, జూన్ 12 ప్రభాతవార్త : మండలం పొరవోలు గ్రామ పంచాయతీకి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ సర్పంచ్ వీపూరు జనార్ధన్‌చారి సతీమణి వీపూరు సంపూర్ణమ్మ ఇటీవల మరణించాలని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారి యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి వెంట మండల నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు.

విద్యార్థులుకు క్రమశిక్షణ చదివే ముఖ్యం : కిషోర్

వాకాడు, జూన్ 12 ప్రభాతవార్త : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో పాటు చదివే ముఖ్యమని ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ తెలిపారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా కిషోర్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఇదే కళాశాల పాఠశాలలో మూడు నెలలు మ్యాథమెటిక్స్ లెక్చరర్ గా, కోట గురుకులంలో పది సంవత్సరాలు మ్యాథమెటిక్స్ పనిచేసారు, అనంతరం బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి లెక్చరర్‌గా పనిచేస్తూ ప్రమోషన్ పై రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా అదే కళాశాలలో పనిచేస్తూ బదిలీపై రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా వాకాడు గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టానన్నారు.

సిహెచ్ గ్రూపునకు డ్రోన్ అందజేత

వాకాడు, జూన్ 12 ప్రభాతవార్త : 1వ రైతు సేవ కేంద్రం ద్వారా లోక్ సాయి డ్రోన్ సిహెచ్ గ్రూపునకు ఏవో దీప ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు చేతుల మీదుగా డ్రోన్ అందజేశారు. గురువారం ఒకటవ రైతు సేవ కేంద్రం లో ఏవో దీప ఆధ్వర్యంలో టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రమీల చేతుల మీదుగా డ్రోన్‌ను అందజేశారు. ఏవో దీప మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సేవా కేంద్రం ద్వారా సుమారు పది లక్షల రూపాయలు విలువగల డ్రోన్‌ను 80రాయితీతో రైతులకు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నంద గోపాల్ రెడ్డి,రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ భార్గవ్, శివరామిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది లక్ష్మయ్య, లోక్ సాయి డ్రోన్ సిహెచ్ సభ్యులు నందగోపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

- బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్

కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త : యోగాతో ప్రజలకు చక్కటి ఆరోగ్యకర జీవితం లభిస్తుందని కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగాదినోత్సవంలో భాగంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో యోగాంధ్రపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అంటే శారీరక వ్యాయామాలు, ఆసనాలు వేయడమే కాదని దీని ద్వారా మేధాశక్తి, ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. యోగాతో వివిధ రకాల మానసిక ఒత్తిళ్లను తట్టుకోవచ్చన్నారు. కాలేజ్ వైస్ ఛైర్మన్ సునీల్ రాజ్ యోగాతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శరీర అవయవాలు సక్రమంగా పనిచేస్తాయన్నారు. యోగాతో ఏకాగ్రత సైతం పొందవచ్చన్నారు. అనంతరం యోగా మాస్టర్ గణేష్ నేతృత్వంలో యోగా సాధన చేయించారు. కార్యక్రమంలో సిఇఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ కోదండరామయ్య, హెచ్ఒడిలు, అధ్యాపకులు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశానికి డుమ్మా కొట్టడం పట్ల ఎంపీపీ సీరియస్

సత్యవేడు, జూన్ 12 ప్రభాతవార్త: అక్రమ మద్యం బార్లు అరికట్టడంలో సంబంధిత నాగలాపురం ఎక్సైజ్ అధికారులు మీనా మేషాలు లెక్కించడం ఎందుకని గ్రామ సర్పంచ్ రవిరెడ్డి ప్రశ్నించారు. బుధవారం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన పరిపాలన అధికారి త్రివిక్రమ రావు పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల ప్రగతిపై ఆయా అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖపై చర్చ ప్రారంభంగాక సంబంధిత అధికారులు ఎవరు సమావేశానికి హాజరు కాలేదు. అయినా కూడా దాసుకుప్పం గ్రామ సర్పంచ్ రవిరెడ్డి దీనిపై జోక్యం చేసుకుని మద్యం షాపుల వద్ద అక్రమ బార్లునిర్వహణను ప్రస్తావించారు. దాదాపు 24 చిల్లర దుకాణం యజమానులే ఎలాంటి అనుమతులు లేకుండా బార్లను నడిపిస్తున్నారన్నారు. ఇదేగాక రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చోద్యం చూడడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యానవనానికి సంబంధించిన చర్చలో రాజగోపాల పురం సర్పంచ్ మధురాజు జోక్యం చేసుకుని పూలతోటపెంపకం, కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టన్ను 8 వేల రూపాయలకు తోతాపూరి మామిడిని పాలగుంట కంపెనీ యాజమాన్యం తీసుకోవడం లేదని పుదుకుప్పం ఎంపీటీసీ సరవణ సభ అధ్యక్షులకు విన్నవించారు. మండలంలో ఈ విద్యా సంవత్సరం నుంరచి 12 మోడల్ ప్రైమరీ స్కూలు ప్రారంభమవుతుందని ఎంఈవో-ఉష పేర్కొన్నారు. అలాగే కన్నవరం ప్రాథమిక ఉన్నత పాఠశాలను ప్రభుత్వం హైస్కూలు స్థాయికి శ్రేణికరించడం జరిగిందన్నారు. ఇరువైపులా గ్యాస్ పైపులైన్లు తవ్వకాలు వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నట్లు రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు సభ దృష్టికి తెచ్చారు. రోడ్ల భవనాలశాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ, తదితర శాఖ అధికారులు మండల సర్వసభ్య సమావేశానికి దుమ్మా కొట్టడం పట్ల ఎంపీపీ ప్రతిమ సీరియస్ అయ్యారు. ప్రతిసారి కొందరు అధికారుల గైర్హాజరు కావడంపై నోటీసులు జారీ చేయాలని పరిపాలన అధికారి త్రివిక్రమరావు కోరారు. గంగజాతర కారణంగాస్థానిక జడ్పీటీసీ విజయలక్ష్మి కూడా సమావేశానికి హాజరు కాలేదు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ విస్తరణ అధికారి తరుణాక్ష రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగభూషణం, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, కో-ఆర్డినేటర్ శివకుమార్, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ భానుప్రకాష్, మండల పరిషత్ ఏఐ ఇబ్రహీం ఖాన్, ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షవర్ధన్, వైస్ ఎంపీపీ సరోజని, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, ఎంపీటీసీలు సెల్వి, బాలయ్య, పలువురు సర్పంచ్‌లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

అభివృద్ధి...సంక్షేమంతో కూటమి పాలన : గంజి

పుత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా అమలు చేస్తూ కూటమి పాలన ఏడాది పాటు దిగ్విజయంగా కొనసాగిందని పద్మ